

తినే ఆహారంలో ఎంతెంత విషం ఉందని చేసిన ఓ అధ్యయనంలో మనిషి ఆహారంతోపాటు ఎంత విషం తింటున్నాడో పరిశీలించింది. ఒక భారతీయుడు రోజుకు సగటున 354 మిల్లీ గ్రాముల విషాన్ని తింటున్నాడని తేలింది. అదే అమెరికాలో ఒక వ్యక్తి సగటున రోజుకు 7 మిల్లీ గ్రాములు. కూరగాయలు, ఆహార పంటల సాగులో వాడే పెస్టిసైడ్స్ వల్ల ఇంత విషం మనం తినాల్సి వస్తోందని నాకు అర్థమైంది. 'సత్యమేవ జయతే' అనే టీవీ కార్యక్రమంలో... 'మీరు రసాయనాలు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పండించిన ఆహారం విదేశాలకు అమ్ముతున్నారు. రసాయన పురుగు మందులను ఇక్కడి రైతులకు అమ్ముతున్నారు. ఇదేమి ద్వంద్వ నీతి' అని ఒక పెస్టిసైడ్స్ కంపెనీ అధిపతిని వ్యాఖ్యాత అమీర్ ఖాన్ ప్రశ్నించారు. 'డిమాండ్‌ని బట్టి బిజినెస్ చేస్తాం. రైతులు కావాలని అడుగుతున్నారు కాబట్టి పురుగు మందులు అమ్ముతున్నాం' అని ఆయన సమాధానం చెప్పారు. అప్పుడు మనం ఎంత తప్పుడు మార్గంలో వ్యవసాయం చేస్తున్నామో అర్థమైంది.

**సత్యం తెలిపిన పాలేకర్**

వైద్యానికి సహకరించిన ఆరుగురు క్యాన్సర్ బాధితుల్లో నలుగురు చనిపోయారు. అల్లోపతి డాక్టర్లు చనిపోతారని చెప్పిన ఇద్దరు ఆయుర్వేద వైద్యం వల్ల బతికారు. క్యాన్సర్ బారిన పడకుండా నలుగురికి మంచి విషయాలు చెబుదామని ఇంకా అధ్యయనం చేస్తూ పోయాను. సుభాష్ పాలేకర్ ప్రసంగాలు విన్నాను. తెగుళ్లు, కీటకాల నుంచి పంటలను కాపాడుకునేందుకు ఆయన రసాయనాలు లేని పద్ధతులు చెబుతున్నాడు. ఆచరిస్తున్నాడు. భూమిలో సారం లేక పంటమొక్కలు బలహీనం అవుతున్నాయి. అందుకే తెగుళ్లను తట్టుకోలేకపోతున్నాయని, భూమిని బలోపేతం చేయాలని ఆయన చెబుతున్నాడు. పాడి పంట జంటగా సాగాలనేది పాలేకర్ వాదన. తర్వాత వ్యవసాయ శాస్త్రవేత్తలను కలిశాను. పశువులు, పెంట లేకపోవడం వల్ల రైతులు రసాయన ఎరువులను ఉపయోగిస్తున్నారు. అధిక దిగుబడి వచ్చినా, ఆ తర్వాత భూసారం కోల్పోయి నష్టపోతున్నారని వాళ్లుచెప్పారు. పాలేకర్ చెప్పేది సత్యమని అర్థమైంది.

**గుండెలపై ఆడించిన అనురాగం**

నా స్నేహితుడు రాజా రామ్ బస్వపత్రి బెంగళూరులో ఉద్యోగం చేసేవాడు. తన ఆరేళ్ల బిడ్డ క్యాన్సర్ బారినపడిందని చెప్పాడు. ఇద్దరం క్యాన్సర్ గురించి ప్రతి విషయాన్నీ తెలుసుకునేందుకు ఇంటర్నెట్‌లో వెదికాం. చివరికి తన బిడ్డకు క్యాన్సర్‌కి కారణం ఏమిటో తేల్చుకున్నాం. బెంగళూరులో వాళ్లు తింటున్న ఆహారాన్ని ల్యాబ్‌లలో టెస్ట్ చేయించాడు. నూనె, పాలు, కొబ్బరి నీళ్లు కలుషితమని తేలింది. కొబ్బరిచెట్టుపై ఉండే కొమ్ము పురుగుని చంపడం కోసం మోనోక్రోటోపాస్‌ని చెట్టు వేర్ల దగ్గర పెడుతున్నారు. అయితే, కొబ్బరినీళ్లు పోసుకునే సమయంలో ఇలా చేయకూడదు. తెలిసినా లాభాల కోసం రైతులు ఇలా చేస్తున్నారు. ఆ కొబ్బరి నీళ్లలో చేరిన కెమికల్స్ వల్ల ఆ పాప క్యాన్సర్ బారిన పడిందని అర్థమైంది. ఎంత ప్రయత్నించినా ఆ బిడ్డను కాపాడుకోలేకపోయాం.

**జీవామృతమే అమృతం**

సమగ్ర వ్యవసాయ విధానం ఎంచుకుని పని మొదలుపెట్టాను. కొత్త ఒరవడిలో వ్యవసాయం చేయాలని ప్రయోగాలు చేశాను. పాడి, పంట పద్ధతిలో వ్యవసాయానికి పశుపోషణని అనుబంధం చేశాను. సేంద్రియ పద్ధతిలో నేల ఒక్కసారిగా మారదు. చీడ పీడల్ని పైరు తట్టుకోలేకపోయింది. కాబట్టి దిగుబడి అనుకున్నంత రాలేదు. నేల గుల్లబారుతుందని డ్రిప్ ఇరిగేషన్ ఎంచుకున్నాను. నేలలోకి పేడ పురుగు వచ్చింది. ఎలుకలు చేరాయి. జీవాల (ఆవులు, మేకలు, కోళ్లు) పెంపకంలో నష్టం రాలేదు. పాడి బాగానే ఉన్నా పంట దిగుబడి అంచనాలు తప్పాయి. ఆ దెబ్బకు బాగా నష్టపోయాను. బాధపడలేదు. ఎక్కడ తప్పు చేశానో తెలుసుకున్నాను. మా నాన్న సహకారంతో మార్పులు చేశాను. ఖర్చులు తగ్గించుకునేందుకు కొన్ని మార్పులు చేశాను. ఆదర్శ రైతులను కలిశాను. వాళ్ల అనుభవాలు విన్నాను. వాళ్ల సాగు పద్ధతులు దగ్గరగా చూశాను. ఏటా భూసారం తగ్గుతూ ఉంటుంది. మా పొలంలో మట్టిని పరీక్షిస్తే కర్బన శాతం తక్కువగా ఉంది. భూసారాన్ని పెంచేందుకు చింతల వెంకటరెడ్డి, గోపాల్ బాయ్ సుతారియా, పాలేకర్ పద్ధతులు పాటించాను. గోకృపామృతం, దేశీ ఆవు మూత్రం, పేడ ద్వారా నాలుగు రకాల జీవ శిలీంధ్రాలను పెంచాను. పచ్చిరొట్ట, ఎరువులు వేసి నేలలో కర్బన శాతం పెంచాను. మట్టిలో సూక్ష్మజీవులను పెంచేందుకు వాటికి కావాల్సిన ఆహారం వేసి సారవంతం చేశాను. ఆ తర్వాత దిగుబడితోపాటు లాభం వచ్చింది. ఇక వెనుదిరిగి చూడలేదు. ప్రయోగాలు, పరిశోధనతో అనేక పంటలు పండించాను. నా క్షేత్రంలో ఆచరించిన పద్ధతులు, వాటి ఫలితాలను తోటి రైతులకు, శాస్త్రవేత్తలకు చెబుతున్నాను. పంటలతోపాటు నేలను సారవంతం చేసే అవగాహనా పెంచుకున్నాను. హైదరాబాద్ సమీపంలోని క్షీరసాగర్ గ్రామంలో 100 ఎకరాల చౌడు భూమిని సారవంతంగా మార్చాను.




**సాగుబాటలో విజయాలెన్నో**

ఎదసాగు విధానంలో పొలంలో నేరుగా వరి విత్తనాలు నాటాను. సాధారణ నాటు వేసే పద్ధతిలో వరి సాగుకు ఎకరానికి 25 కేజీల విత్తనాలు అవసరం. ఎదసాగు పద్ధతిలో 15 కేజీలు సరిపోయాయి. ఎకరానికి పది కేజీల విత్తనాలు, నాటు కూలీ ఖర్చు తగ్గాయి. నా వ్యవసాయ విధానం చూడటానికి అప్పటి ఎంపీలు కల్వకుంట్ల కవిత, బోయినపల్లి వినోద్ కుమార్ సందర్శించారు. అభినందించారు. ఈ వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకునేందుకు ప్రధానమంత్రి మోదీ నాలుగు సార్లు నాతో మాట్లాడారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో నాతో, నా కుటుంబంతో ఆయన ఎనిమిది నిమిషాలపాటు ముచ్చటించారు. నా అనుభవాలు పాఠాలుగా చెప్పాలని సూచించారు. అంతకు ముందు రైతుల ఆదాయం రెట్టింపు కార్యక్రమంలో నాలుగు సార్లు ప్రధానిని కలిసి మాట్లాడాను. పంటకు కావాల్సిన సమగ్ర పోషకాలను అందించేలా నేలను సారవంతం చేయడం, తెగుళ్ల నివారణలో తోటి రైతులతో, శాస్త్రవేత్తలతో నా అనుభవాలు పంచుకుంటున్నాను. ఈ కృషికిగాను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ 2021లో ఇన్నొవేటివ్ ఫార్మర్ అవార్డ్ ప్రదానం చేసింది. ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫెలో ఫార్మర్ అవార్డ్ ప్రకటించింది. పంట చేతికొచ్చినంత సంతోషంగా ఉంది. ■

**క్షేత్రమే నా ఏటీఎం**

సమగ్ర వ్యవసాయ విధానంలో నా వ్యవసాయ క్షేత్రాన్ని ఏటీఎంలా తయారు చేసుకున్నాను. నా కుటుంబానికి కావాల్సిన ఆహార అవసరాలన్నీ వ్యవసాయ క్షేత్రమే తీరుస్తున్నది. ఆహారంతోపాటు ఆదాయం సమకూరే స్థాయిలో ప్రణాళికలు వేసుకున్నాను. వరితోపాటు పప్పులు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేశాను. వ్యవసాయానికి అనుబంధంగా ఆవులు, మేకలు, కోళ్లు, వ్యవసాయ బావిలో చేపల పెంపకం చేపట్టాను. పశువుల పేడ, కోళ్ల పెంట భూమికి ఎరువుగా ఉపయోగపడతాయి. క్షేత్రంలోనే జీవామృతం, ఇతర శిలీంధ్ర, కీటక నాశకాలను తయారు చేసుకున్నాను. ఆవులు ఇంటికి సరిపోయేకంటే ఎక్కువ పాలిచ్చేవి. వాటిని మార్కెట్లో అమ్మాను. దేశీ కోళ్లతో సంకర పరిచిన సోనాలి, గిరిరాజా, వనరాజా కోళ్లను పెంచాను. ఈ కోళ్లు ఆరు నెలల వయసులో గుడ్లు పెట్టడం మొదలుపెడతాయి. పాడి కోసం ఎక్కువ పాలు ఇచ్చే గిర్ జాతి ఆవులు తెచ్చుకున్నాను. పొలంలో కొంత స్థలంలో పశుగ్రాసం పెంపకానికి కేటాయిస్తాను. వాన నీటిని బావిలోకి మళ్లించుకున్నాను. బావి నీటినే సాగుకు ఉపయోగిస్తున్నాను. ఇందులో రకరకాల చేపలు పెంచుకుంటున్నాను.





...✍ నాగవర్ధన్ రాయల